వేతన వెతలు


పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన(ఫైల్)

దౌల్తాబాద్: కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తి కావస్తోంది. కానీ పంచాయతీ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఆరు నెలలుగా వేతనాలు అందక వారు ఇబ్బంది పడుతున్నారు. ఆర్థిక సమస్యలతో అల్లాడిపోతున్నారు. కుటుంబ పోషణ భారమై.. అప్పుల పాలవుతున్నారు. అయినా కష్టాల కన్నీళ్లు దిగమింగుతూ.. చెమటోడుస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. కరుణించండి సారూ అని పదేపదే వేడుకున్నా.. నిరసన వ్యక్తంచేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

సాధారణ నిధుల నుంచి..

సుమారు ఏడాదిన్నరగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్‌ఎఫ్‌సీ) నిధులు, ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడంలేదు. దీంతో ఏడాదికి పైగానే సంబంధిత అధికారులు పంచాయతీల్లో సాధారణ నిధుల నుంచి కార్మికులకు జీతాలు ఇచ్చి నెట్టుకు వస్తున్నట్లు సమాచారం.

మల్టీపర్పస్ పనులు

మండల పరిధి 33 గ్రామపంచాయతీల్లో మొత్తం 129మంది పారిశుద్ధ్య కార్మికులు పని పనిచేస్తున్నారు. ఒక్కో కార్మికుడికి రూ.9,500 వేతనం చెల్లిస్తుండగా, ఒక్కో గ్రామానికి జనాభాకు అనుగుణంగా ఇద్దరి నుంచి 10మంది వరకు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జీపీల్లో కార్మికులను మల్టీపర్పస్ కార్మికులుగా పిలుస్తుండగా.. వీరు పారిశుద్ధ్య పనులతో పాటు ఇంటింటికి వెళ్లి ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరించడం, సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్త వేరుచేయడం, వర్మీ కంపోస్టు తయారీ చేయడం, మొక్కలకు నీరు పట్టడం, నీటి సరఫరా విభాగంలో పనిచేయడం వంటి పనులు చేస్తున్నారు.

కొరవడిన చురుకుదనం

పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఫలితంగా విధి నిర్వహణలో చురుగ్గా పాల్గొనలేకపోతున్నారు. దీంతో పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఇదిలా ఉండగా.. పంచాయతీల్లో కనీసం కార్మికుల వేతనాలను ఇవ్వకపోవడం, ఎలాంటి గ్రాంట్లు రాకపోవడం వలన ఏమీ చేయలేకపోతున్నామని ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు అందించేలా చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

అప్పు చేస్తున్నాం



వేతనాలు అందక కుటుంబ పోషణ కష్టంగా మారింది. అప్పు చేయాల్సి వచ్చింది. సర్పంచ్ ఉన్నప్పుడు చేబదులు ఇచ్చి ఆదుకునేవారు. ఇప్పుడు ప్రత్యేకాధికారి, కార్యదర్శిని అడిగే పరిస్థితి లేదు. జీతాల కోసం ఎదురు చూస్తున్నాం.

– సాయిదాసు, మల్టీపర్పస్ కార్మికుడు, దౌల్తాబాద్

అందేలా చూస్తాం

ఉన్నతాధికారుల దృష్టికి కార్మికుల సమస్యల తీసుకెళ్లి వేతనాలు అందేలా కృషి చేస్తాం. కేంద్ర, రాష్ట్రాల నుంచి నిధులు మంజూరు కాగానే జీతాలు అందుతాయని అనుకుంటున్నాం. బడ్జెట్ లేకపోవడంతోనే సమస్య ఏర్పడింది.

– రవీందర్, ఎంపీఓ

ఆరు నెలలుగా అందని జీతాలు

- ఆందోళన చెందుతున్న సఫాయి కార్మికులు

పైసలు ఇచ్చేంత వరకు పనులకు దూరం


తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కుల్కచర్ల: 'నాలుగు నెలలుగా జీతాలు అందడంలేదు. వేతనాలు ఇప్పించండి సారూ..' అని పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెక్కాడితేగాని డొక్కాడని జీవితాలు మావి.. నెలలు గడిచినా జీతాలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యదర్శిని అడిగితే పరిగి ఎస్టీఓ ఆఫీసులో సమస్య ఉందంటున్నారు. ఎంపీడీఓ ఆఫీసు వాళ్లను అడిగితే త్వరలోనే వస్తాయి అని అంటున్నారు. నెలలు గడుస్తున్నాయని కానీ.. జీతాలు రావడం లేదని వాపోతున్నారు. జీతాలు వచ్చేంత వరకు పనులకు దూరంగా ఉంటామని కార్మికులు స్పష్టంచేస్తున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, జీతాలు త్వరగా ఇప్పించేందుకు కృషిచేస్తామని వెల్లడించారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

ప్రాణాంతకంగా మారిన గుంతలు


తిమ్మారెడ్డిపల్లి చెరువులో గుంతలు

దౌల్తాబాద్: మండల పరిధి పలు గ్రామాల్లో చెరువులు, కుంటల్లో భారీ యంత్రాలతో చేపట్టిన మట్టి తవ్వకాల వలన గుంతలు ఏర్పడి ప్రాణాంతకంగా మారాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీటి వలన వర్షాకాలంలో చెరువులు, కుంటలు నీటితో నిండి, గుంత లోతు తెలియక నీట మునిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. విచ్చలవిడిగా మట్టి, మొరం, ఇసుకను తోడేస్తుండటంతో ప్రమాదకర గుంతలు ఏర్పడుతున్నాయని, చేపల వేటతో పాటు బట్టలు ఉతకడానికి మహిళలు, స్నానం చేయడానికి చిన్నారులు ఇతర అవసరాలకు వెళ్లిన వారు వీటి బారిన పడి మత్యువాతపడుతున్నారని చెప్పారు. ఇలాంటి ఘటనలు గతంలో మండలంలో చోటుచేసుకున్నాయన్నారు. గోకఫసల్‌వాద్ చెరువులో ఏర్పడిన గుంతలో పడి తల్లి, కూతురు, దౌల్తాబాద్‌లో చేపలవేటకు వెళ్లిన ఓ వ్యక్తి గుంతలో ఇరుక్కుని, గుముడాల గ్రామంలో గుంతలో పడి ఒకరు చనిపోయారని పేర్కొన్నారు. మిషన్‌కాకతీయ పథకం కింద చేపట్టిన పూడికతీత పనులతో పాటు ఇతర అవసరాలకు కొందరు చెరువులు, కుంటల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి మట్టిని తరలించి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇటుక బట్టీల వ్యాపారులు ఇష్టంగా మట్టిని తోడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాని వెల్లడించారు. ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారిన గుంతలను.. మరో ప్రమాదం చోటుచేసుకోకముందే పూడ్చివేయాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పరిశుభ్రత పాటిస్తే.. రోగాలు దరిచేరవు

మలేరియా, ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప


మురుగు కాలువ వద్ద శానిటైజేషన్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

దుద్యాల్: సీజనల్ వ్యాధుల వ్యాపించే కాలం.. ఇంటి పరిసరాలతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే మేలని మలేరియా, ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప అన్నారు. మండల పరిధి నాజుఖాన్‌పల్లి గ్రామంలో ఆయన శుక్రవారం సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రధాన వీధుల గుండా తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పకీరప్ప మాట్లాడారు. వీధుల్లో ఎక్కడా చెత్త చెదారం ఉండకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలు, పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. మురుగు కాలువలు పేరుకుపోకుండా చూడలన్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే.. వ్యాధులు మన దరిదాపులకు రావని స్పష్టంచేశారు. అనంతరం మురుగు కాలువలను శానిటైజేషన్ చేయించారు. పలువురి ఇంటి పైన వాహనాల టైర్లు ఉండటాన్ని గమనించి, వాటి వలన వ్యాధులు సోకే అవకాశం ఉందని తొలగింప చేశారు. వైరల్ ఫీవర్ల పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సమష్టిగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శివలింగప్ప, ఏఎన్‌ఎం షాహేదా బేగం, ఆశ కార్యకర్త శివనీల, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత

యాలాల: మండల పరిధి అగ్గనూరు గ్రామానికి చెందిన నర్సిరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి.. బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.1.80లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. అనారోగ్యం పాలైన పేద ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇందులో మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తం రావు తదితరులు ఉన్నారు.

సదరం స్లాట్ బుక్ చేసుకోండి

మోమిన్‌పేట: అంగవైకల్యం, బుద్ధి మాంద్యం, చేవుడు, మూగ వారు శనివారం ఉదయం 11గంటలకు సదరం స్లాట్ బుక్ చేసుకోవాలని ఏపీఎం రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారు ఈ నెల 12,23,24,30,31తేదీలలో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే క్యాంపునకు హాజరు కావాలని పేర్కొన్నారు. వికారాబాదు కమ్యూనిటీ ఆస్పత్రిలో ఈ నెల 9,16,19,25 తేదీలలో నిర్వహించే క్యాంపునకు అంధులు, అంగ వైకల్యం గల వారు రావాలని ఏపీఎం సూచించారు. ఆదే విధంగా గతంలో సదరం ధ్రువీకరణ పత్రం పొంది, కాలపరిమితి అయిపోయిన వారు కూడా హాజరు కావాలని వెల్లడించారు.

మొక్కలు నాటి పచ్చదనం పెంచండి


మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

మోమిన్‌పేట: మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దుర్గమ్మ గుడి ప్రాంగణంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని ఆయన మొక్కలను నాటారు. అనంతరం మాట్లాడారు. వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందని, అందుకొరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరగడం వలన సమయానికి వర్షాలు పడతాయని, తద్వారా వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో పార్టీ నాయకులు చంద్రశేఖర్, మైపాల్, నర్సింహ్మరెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

కుల్కచర్ల: వాగు పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా కొనసాగుతున్న ఇసుక తవ్వకాలను అరికట్టాలని కుస్మసముద్రం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం వలనే ఇసుక దొంగలు పెరిగిపోతున్నారని ఆరోపించారు. ప్రకృతి సంపదను కాపాడాల్సిన వారు ఇలా అలసత్వం వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇసుక డంపులను వెంటనే సీజ్ చేసి, అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

విద్యా పరిరక్షణకు నిరంతర పోరాటం

ఆర్‌ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి


ఆర్‌ఎస్‌యూ జెండా ఆవిష్కరిస్తున్న రవిశంకర్‌రెడ్డి తదితరులు

కొడంగల్ రూరల్: ప్రభుత్వ విద్యా పరిరక్షణతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై నిరంతరం పోరాటం చేయాలని రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్(ఆర్‌ఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో ఆర్‌ఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన విద్యను ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని అనేక అంశాల సాధనకు ఢిల్లీ వేదికగా ఆర్‌ఎస్‌యూ తరపున పోరాటం చేశామని, ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు, రాష్ట్ర కార్యదర్శి సురేష్, రాష్ట్ర సలహాదారులు శంకర్, ఉపాధ్యక్షుడు బాలు, సహాయ కార్యదర్శి కాంత్, జిల్లా అధ్యక్షుడు చంద్రకిరణ్, ఉపాధ్యక్షుడు అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం


దౌల్తాబాద్: పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

- నిరుద్యోగుల భృతి, జాబ్ క్యాలెండర్ ప్రకటించని సర్కార్
- ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేయాలి
- విద్యార్థి, ఏబీవీపీ, నిరుద్యోగ జేఏసీ నాయకుల డిమాండ్
- టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి వెల్లకుండా కట్టడి చేసిన పోలీసులు

తాండూరు టౌన్: నిరుద్యోగులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయిస్తుందని విద్యార్థి సంఘం, ఏబీవీపీ, నిరుద్యోగ జేఏసీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి పలు నిరుద్యోగ, విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో పోలీసులు ముందుస్తుగా పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారం చేపట్టి ఏడు నెలలు గడిచినా వాటి ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పూర్తి స్థాయిలో ఉద్యోగాలు భర్తీ చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని పూరించక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే విడుదలైన గ్రూప్–2,3, డీఎస్సీలో ప్రస్తుత ఖాళీలను కూడా కలిపి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మరో మూడు నెలల గడువు ఇచ్చి పరీక్షలను నిర్వహించాలని కోరారు. తాండూరు పట్టణ పోలీసులు గురువారం రాత్రి బీఆర్‌ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు, పట్టణ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, నర్సింలు, స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, బీజేవైఎం నాయకుడు శ్రీకాంత్ రెడ్డి, ఏబీవీపీ నాయకులు పవన్, అజయ్, నిరుద్యోగ జేఏసీ నాయకులు శ్రీధర్, అశోక్ తదితరులను అరెస్టు చేశారు.

అక్రమ అరెస్టులు

కుల్కచర్ల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని విద్యార్థి సంఘం నాయకులు రమేష్ కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్ అన్నారు. టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడి నేపథ్యంలో మండల పరిధి పలువురు విద్యార్థి సంఘం నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

చదువుపై దృష్టి సారించాలి

దోమ: విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్ కుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం మండల పరిధి పాలేపల్లి, గొట్లచల్కతండా అనుబంధ గ్రామమైన మెట్టుగడ్డతండా పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రారెడ్డి, సత్యనారాయణతో కలిసి విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి తల్లితండ్రుల ఆశయాలు, ఉపాధ్యాయుల గౌరవాన్ని నిలబెట్టేందుకు అనునిత్యం చదువుపై సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, రాకేశ్, సంస్థ ప్రతినిధి శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి సంతోషి, జర్నలిస్టులు దస్తయ్య, లాలయ్య, గ్రామస్తులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


ప్రార్థన సమయంలో తప్పనిసరిగా ఉండాలి

ఉపాధ్యాయులకు సూచించిన ఎంఈఓ వెంకటయ్య


గౌతపూర్ పాఠశాల్లో విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయిస్తున్న ఎంఈఓ

తాండూరు రూరల్: ఉపాధ్యాయులు ప్రార్థన సమయంలో పాఠశాల్లో తప్పనిసరిగా ఉండాలని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధి చెంగోల్, పర్వతాపూర్, గౌతపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించారు. అనంతరం పాఠ్యపుస్తకాల్లో ఉన్న పాఠాలను చదివించారు. చెంగోల్ పాఠశాల్లో విద్యార్థులతో పాటు మహిళా ఉపాధ్యాయులకు టాయిలెట్లు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ దృష్టికి తెచ్చారు. ఇదే బడిలో 120 మంది విద్యార్థులకు గాను 97 మంది హాజరు కాగా.. పర్వాతపూర్‌లో 37 మందికి 29 మంది హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. గౌతపూర్ ప్రాథమిక పాఠశాలలో 106 మందికి 65 మంది హాజరు కావడంపై ఎంఈఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని హెచ్‌ఎంను ఆదేశించారు. దీంతో హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాలిషింగ్ యూనిట్లో పని చేసే కార్మికుల పిల్లలు ఉండేవారని, వారు వలస వెల్లడంతో హాజరుశాతం తగ్గిందని వివరణ ఇచ్చారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతతో పాటు, శుభ్రతను పాటించాలని నిర్వాహకులకు ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలో కిష్టప్ప, లీలావతి, ప్రభు ఉన్నారు.

ఘనంగా గోశాలలో గోపూజ


కొడంగల్ రూరల్: అంగడిరాయిచూర్‌లో మట్టెడ్లకు పూజలు చేసిన రైతులు

తాండూరు టౌన్: మట్టెడ్ల అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలోని గోశాలలో గోపూజను వేణుగోపాల్ రెడ్డి దంపతులు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతన్నలకు మట్టితో విడదీయరాని బంధం ఉందని, వ్యవసాయ పనులు ప్రారంభమైన ఈ సమయంలో వచ్చే మట్టెడ్ల అమావాస్యను రైతులు ఎంతో ఘనంగా జరుపుకొంటున్నారని పేర్కొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని ఆమె కోరుకున్నారు. అనంతరం గోశాల సేవకులను సేవా సమితి సభ్యులు సన్మానించారు.

కొడంగల్ రూరల్లో..

కొడంగల్ రూరల్: మండల పరిధి అంగడిరాయిచూర్ గ్రామంలో మట్టి ఎద్దుల అమావాస్యను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామానికి చెందిన రైతు పకీరప్ప నివాసంలో ప్రత్యేక పూజలు చేశారు. పండగ విశిష్టతను తెలిపారు. ఏటా అమావాస్య రోజున ప్రత్యేకంగా మట్టితో ఎద్దులు, ఆవులు తయారు చేసుకుని, వాటిని పూలతో అలంకరించి పూజలు చేసి భక్షాలతో నైవేద్యం సమర్పిస్తామని తెలిపారు. మట్టి ఎద్దులకు పూజలు చేస్తే నేలతల్లి కరుణిస్తుందన్న నమ్మకం ఉందని చెప్పారు. అమావాస్య రోజున పండుగ జరుపుకోవడం వలన సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, నష్టాలు లేకుండా ధాన్యలక్ష్మి ఇంటికి చేరుతుందన్న విశ్వాసం తమకు ఉందని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్


ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.. డెంగీని నిర్మూలిద్దామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని 3వ వార్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలం సీజన్‌లో దోమల నివారణపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దోమలు వ్యాప్తి చెందే కాలం ఇదేనని, కావున పరిసరాల పరిశుభ్రతతో నివారించవచ్చన్నారు. అందుకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలు కూడా తమ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు కిరణ్ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, నాయకులు మౌలానా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• రైతులకు న్యాయం చేయాలి

కొడంగల్: మండల పరిధి అప్పాయిపల్లి గ్రామం సర్వే నంబర్ 19లో ఉన్న రైతులకు న్యాయం చేయాలని ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఒక ప్రటనలో డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం సేకరిస్తున్న భూమికి పరిహారం పెంచాలన్నారు. లేని పక్షంలో భూమికి భూమి ఇవ్వాలని కోరారు. ఇందులో రైతు కూలి పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, వ్యవసాయ కార్మిక జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ వెంకటయ్య ఉన్నారు.

• సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బొంరాస్‌పేట: మండల పరిధి బాపల్లి, సూర్యానయాక్‌తండా తదితర గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు గౌడ్ పంపిణీ చేశారు. పార్టీ యువజన నాయకుడు సంతోష్, మోత్యానాయక్, రాములు, గోపాల్‌రెడ్డి, మోతీలాల్, అలీమ్, శ్రీనివాస్ ఉన్నారు.

• బదిలీ సహజం



కుల్కచర్ల: ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమని మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండల పరిధి చెల్లాపూర్ పాఠశాలలో పనిచేసిన దేవులానాయక్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

• పాదాభివందనం..



దుద్యాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి, ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన జీహెచ్‌ఎం నెహ్రూ నాయక్, ఉపాధ్యాయులు వెంటకయ్య, శిల్ప శ్రీ, శ్రీకాంత్, అనీల్‌ను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం పాదాభివందనం చేశారు.

• సమస్యలు పరిష్కరించేంత వరకు..

పరిగి: నిరుద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోవడం లేదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిగణేశ్ ఆరోపించారు. బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చేపట్టిన టీజీపీఎస్సీ ముట్టడి సందర్భంగా పోలీసులు నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. దీనిని నిరసిస్తూ.. ఆయన మాట్లాడారు. ఉద్యోగ ఖాళీల భర్తీ, తదితర సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామన్నారు.

• బోరు మోటారు 'పంచాయితీ'

తాండూరు రూరల్: మండల పరిధి ఐనెల్లిలో గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరు మోటారుపై వివాదం నెలకొంది. శుక్రవారం జీపీ కార్యాలయం వద్ద కార్యదర్శి అపర్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఉన్న వాటర్ ప్లాంట్‌కు తాగునీటిని సరఫరా చేసేందుకు ఉన్న బోరు మోటారు విషయమై ఇరువర్గాల నాయకుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. తమ హయాంలో బోరు వేశామని, ఇప్పటి వరకు డబ్బులు రాలేదని ఓ వర్గం నాయకులు ఆరోపించగా.. జీపీ మోటారు అని, ప్రైవేట్ వ్యక్తులు ఉపయోగించుకోవద్దని మరో వర్గం అభిప్రాయ పడింది. ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగింది. చివరకు గ్రామ ప్రజల తాగునీటి కోసం వాటర్ ప్లాంట్‌కు బోరు ఉపయోగించుకోవాలని గ్రామస్తులు విన్నవించుకున్నారు. దీంతో మోటారు సమస్య సద్దుమణిగింది.

• అభివృద్ధికి సహకరించండి

వికారాబాద్: అభివృద్ధికి సహకరించాలని, ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని బంట్వారం మండల స్పెషల్ ఆఫీసర్ శంకర్‌నాయక్ (డీఐఈఓ) సూచించారు. శుక్రవారం బంట్వారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఆయన ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాములు, కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు. ఎంపీఓ విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ షిండే, జేఏ షఫీ, పంచాయతీ కార్యదర్శి గోపాల్, సీఓ శ్రీనివాస్ ఉన్నారు.

• లక్ష్యం మేరకు మొక్కలు

వికారాబాద్: వన మహోత్సవంలో భాగంగా బంట్వారం మండలంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని ఈజీఎస్ ఈసీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 4,500 మొక్కలు నాటాలని, ఇప్పటికే నర్సరీల్లో 18 రకాల మొక్కలను సిద్ధంగా ఉంచామని ఆయన చెప్పారు. మహోత్సవానికి సంబంధించి గుంతల తవ్వకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, వర్షాలు కురవగానే మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని తెలిపారు.

• ప్రజాసేవలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం



దోమ: ప్రజాసేవలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం అని పంచాయతీ కార్యదర్శి రాజేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిధి దిర్సంపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో పదవీ కాలం ముగిసిన ఎంపీటీసీ నవాజ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం కార్యదర్శి మాట్లాడారు. ఐదేళ్ల పాటు దిర్సంపల్లిలో ఎంపీటీసీ, సర్పంచ్ అందించిన సేవలను ప్రజలు గుర్తించుకుంటారని తెలిపారు.